# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

**కలెక్టర్ మనుచౌదరి**

సిద్దిపేట, జూన్ 25: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ప్రభుత్వ జనరల్ దవాఖానలో పేదలకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రైవేట్ దవాఖానలకు వెళ్లకుండా ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంగళవారం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని అన్ని విభాగాలను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖానలో వైద్యంతో పాటు శానిటైజేషన్ కార్యక్రమాలు రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్‌ను ఆదేశించారు. విశ్రాంతి గది పరిసరాల్లో శుభ్రత పాటించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో సదానందం, ఆయా విభాగాల డాక్టర్లు పాల్గొన్నారు.



సిద్దిపేట దవాఖాన ఫార్మసీలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



రాయపోల్‌లో రాజిరెడ్డి చిత్రపటానికి పులమాల వేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్,జూన్ 25 : రాయపోల్ మండల మాజీ సర్పంచ్ కాసుల మౌనిక తాతయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీనియర్ నాయకుడు కాసుల రాజిరెడ్డి మృతిపై ఆయన విచారం వ్యక్తం చేశారు.ఆయన చిత్ర పటానికి పులమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జడ్పీటీసీ యాదగిరి,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, మండల కో ఆప్షన్ సభ్యుడు పర్వేజ్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకట్‌నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ఇప్ప దయాకర్, హన్మండ్ల రాజిరెడ్డి, మండల నాయకులు శ్రీనివాస్, ఇప్ప దయాకర్, సత్యం, వెంకట్‌గౌడ్, మురళిగౌడ్, రాజుగౌడ్, రామచంద్రం, బుజ్జీ, రంగారెడ్డి, నవీన్‌గౌడ్, భార్గవ్, రాజిరెడ్డి,బాగిరెడ్డి, తొగుట మండల అధ్యక్షుడు రాంరెడ్డి ఉన్నారు.

## క్రీడాపాఠశాలలో ప్రవేశం కోసం పరీక్షలు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 25: క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం హుస్నాబాద్‌లో విద్యార్థులకు మంగళవారం పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రన్నింగ్, బాల్‌త్రో, వెర్టికల్‌జంప్ తదితర పరీక్షలు పెట్టి వారి ప్రతిభను పరిశీలించారు. ఎంఈవో యాదవరెడ్డి మాట్లాడుతూ 19మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు ఈనెల 27వ తేదీన సిద్దిపేటలో జిల్లాస్థాయి పోటీలకు హాజరుకావాల్సి ఉంటుందని వివరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి, పీడీలు శ్రీనివాస్, శౌరిల్, పీఈటీలు కళావతి, స్వప్న పాల్గొన్నారు.



హుస్నాబాద్‌టౌన్ : క్రీడా పాఠశాల ఎంపికలో బాల్ త్రో వేస్తున్న విద్యార్థి

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

వర్గల్, జూన్ 25: వర్గల్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు,శాశ్వత చైర్మన్ శ్రీయాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నివేదనలు జరిపించారు. ఈ సందర్భంగా శ్రీశారదాస్మార్తవేదపాఠశాలలో 22 మంది వేద విద్యార్థులకు నూతనంగా ప్రవేశం కల్పించారు.



స్వామివారిసేవలో భక్తులు

## పంచాయతీలకు నిధులు కేటాయించాలి

మిరుదొడ్డి, జూన్ 25 : గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి గ్రామాభివృద్ధికి దోహదపడాలని మిరుదొడ్డి మండల కార్యదర్శుల అధ్యక్షుడు ఎండీ వహీం అన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఎంపీడీవో గంగుల గణేశ్‌రెడ్డికి కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ ఫహీన్ మాట్లాడుతూ ఆరు నెలల నుంచి గ్రామ పంచాయతీలో నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎంపీడీవో గణేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

## ఢిల్లీలో ఎంపీ చామలను కలిసిన నాయకులు

చేర్యాల, జూన్ 25 : భువనగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కాంగ్రెస్ చేర్యాల మండల నాయకులు ఎంపీని ఢిల్లీలో కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఉడుముల బాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, వీరన్నపేట మాజీ సర్పంచ్ కొండపాక భిక్షపతి, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ఖాజా, నాయకులు తాటిపాముల పరశురాములు,ఎలుగల రాజు, ఎండీ ఖలీల్‌పాషా, కీసర నర్సింహులు ఉన్నారు.



ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున చేర్యాల నాయకులు

## అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన

సిద్దిపేటరూరల్, జూన్ 25 : అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని తోర్నాల వ్యవసాయ కళాశాల ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి అన్నారు. మంగళవారం తోర్నాల వ్యవసాయ ఏరువాక కేంద్రంలో దేశ పాండే ఫౌండేషన్ ఫీల్డ్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్షా 8 వేల ఎకరాల్లో పత్తి సాగు అంచనా ఉందన్నారు. సాధారణ పద్ధతిలో మొక్క అధికంగా పెరగడం, పంటకాలం ఎక్కువగా ఉండి గులాబీరంగు పురుగు ఉధృతి పెరిగి దాని నివారించడం రైతులకు కష్టంగా మారిందన్నారు. కూలీల కొరతతో సాగు ఖర్చు అధికం అవుతుందన్నారు. పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి పాటిస్తే దిగుబడి ఆశించిన మేర పొందవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయ్, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ పల్లవి, శ్రీజయ, ఉమారాణి, శ్వేత, సరిత, రైతులు పాల్గొన్నారు.



అధిక సాంద్రత పత్తిసాగు ప్రయోజనాలను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

## బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

సిద్దిపేట టౌన్, జూన్ 25 : బస్సు సర్వీస్ సేవలను తిరిగి పునరుద్ధరించాలని రాజపేట మండలం నర్సాపూర్ గ్రామస్తులు,ప్రజా ప్రతినిధులు మంగళవారం సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇదివరకు సిద్దిపేట నుంచి కొమురవెల్లి, రాజాపేట, జగదేవ్‌పూర్ మీదుగా గ్రామానికి బస్సులు నడిపారన్నారు. ఆరు నెలలుగా ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలను ఆకస్మికంగా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు రామిడి మోహన్‌రెడ్డి, అశోక్ రెడ్డి, ఎమ్మ భాస్కర్,రాజిరెడ్డి, శ్రీను, ప్రకాష్, భాను, నర్సింహులు, మహేందర్, కొండల్‌రావు, సాగర్ పాల్గొన్నారు.

## డిమాండ్లు పరిష్కరించాలి

సిద్దిపేట, జూన్ 25: డిమాండ్ల సాధన కోసం జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె మంగళవారం రెండోరోజు కొనసాగింది. జూనియర్ డాక్టర్ల డి మాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో సమ్మెను కొనసాగించారు. సమ్మె కారణంగా దవాఖానలో సాధారణ వైద్యసేవలకు ఆటంకం ఏర్పడింది. అన్ని అత్యవసర సేవలను రోగులకు అం దించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కొమురవెల్లిలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కొమురవెల్లి, జూన్ 25 :అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కొమురవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఏఎస్సై రామ్మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన,ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిస కావొద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నంగునూరులో..**

నంగునూరు, జూన్ 25 : మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా మండలంలోని నంగునూరు జడ్పీహెచ్ఎస్‌లో ఎస్సై భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం వచ్చిన వారికి బుధవారం సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

**విద్యార్థులకు అవగాహన**

మద్దూరు(ధూళిమిట్ట) జూన్ 25 : మాదకద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మద్దూరు ఏఎస్సై జగదీశ్వర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, దాని నివారణ మార్గాలపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనరబర్చిన విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్స్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**చేర్యాలలో..**

చేర్యాల, జూన్ 25 : పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవానిచేర్యాల పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపించిన వారికి బహుమతులు అందజేశారు.అనంతరం ఎస్సై దామోదర్ మాట్లాడారు.

**మాదకద్రవ్యాల నివారణ అందరి బాధ్యత**

హుస్నాబాద్, జూన్ 25 : మాదకద్రవ్యాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యతగా భావించాలని మున్సిఫ్‌కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని సీవీ రామన్ హైస్కూల్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మాదక ద్రవ్యాల తరలింపు, సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన వారు ఉన్నత శిఖరాలను చేరుకోలేరన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏజీపీ కన్నోజు రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, హెచ్ఎం కాయిత నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య

చేర్యాల, జూన్ 25 : తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరరూ కృషి చేయాలని కురుమ సంఘం నాయకులు అన్నారు. పట్టణంలోని బీరప్ప దేవాలయం వద్ద మంగళవారం దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాన్ని కురుమ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనగామ పట్టణ కురుమ సంఘం గౌరవ అధ్యక్షుడు మోటే శ్రీశైలం మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా జూలై 4న జనగామ జిల్లా కేంద్రంలోని కళ్లెం రోడ్డు కమాన్ పక్కన ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి చేర్యాల ప్రాంతం నుంచి కురుమ కులస్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఆవిష్కణ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ జిల్లా కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంచె రాములు హాజరుకానున్నట్లు తెలిపారు. కురుమ సంఘం నాయకులు జూకంటి శ్రీశైలం, దయ్యాల శ్రీనివాస్, యేండ్రు వైకుంఠం, కర్రె రాములు, శెవల్ల రాజయ్య, అందె బీరయ్య, అందె నానిబా బు, అందె అశోక్, కామల్ల అనిల్, జంగిలి యాదగిరి,భూమయ్య, శెట్టె ఓజయ్య, నంగి కనకయ్య, ఏగుర్ల ఎల్లయ్య, కర్రె రవి, అంజయ్య, బండారి శ్రీశైలం పాల్గొన్నారు.



చేర్యాలలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కురుమ సంఘం నాయకులు

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

హుస్నాబాద్, జూన్ 25 : కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గంలోని చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని వెంకటయ్య ప్రమాదవశాత్తు మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, చిగురుమామిడి, హుస్నాబాద్ బీఆర్ఎస్ నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మామిడి అంజయ్య, కృష్ణమాచారి, ఎండీ అన్వర్, ఎడబోయిన తిరుపతిరెడ్డి, యాస శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ అధికార ప్రతినిధుల నియామకం**

హుస్నాబాద్, జూన్ 25: బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధులుగా పట్టణానికి చెందిన సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డిలను నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం హుస్నాబాద్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వీరిద్దరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమ నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో పాటు నియోజకవర్గంలోని నాయకులకు వారు ధన్యవాదాలు తెలిపారు.



బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

## మానక అక్రమ రవాణాపై అవగాహన

సిద్దిపేటరూరల్, జూన్ 25 : పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇర్కోడు మోడల్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, మానవ అక్రమ రవాణా, మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డ్రైవింగ్‌పై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. చెడు అలవాట్లకు ఎవరూ బానిస కావొద్దని రూరల్ పోలీసులు వివరించారు.



ఇర్కోడు స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

## మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్**



గట్లమల్యాల పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నంగునూరు, జూన్ 25 : మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా క్లినిక్‌కు వచ్చిన మహిళలకు అన్ని రకాల పరీక్షలు చేసి చికిత్స అందించాలని జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని గట్లమల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమం పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కాశీనాథ్, పీహెచ్‌సీ వైద్యాధికారి అంజని, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాద బీమా అమలు చేయాలి

సిద్దిపేట టౌన్,జూన్ 25 : భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని భవన నిర్మాణ కార్మిక శాఖ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. మంగళవారం సిద్దిపేటలో ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తక్షణమే ప్రమాద బీమా అమలు చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా,గాయపడిన కార్మికులకు ప్రమాద బీమా అమలు చేయాలని కోరారు. నిర్మాణ సమయంలో కార్మికులు గాయపడితే తక్షణ సాయం రూ.5 లక్షలతో పాటు కోలుకునే వరకు ప్రతి నెలా 5వేల సాయం అందించాలన్నారు.కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రశాంత్,సిద్దిపేట సుతారి సంఘం అధ్యక్షుడు తొట్ల నర్సింహులు, రాములు, కిషన్, ఎల్లయ్య, ఎల్లం,రం గం, రంగయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక శాఖ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం

## కార్యకర్తలకు అండగా ఉంటాం

గజ్వేల్, జూన్ 25 : మొదటి నుంచి కష్టపడిన కార్యకర్తలకు పూర్తిస్థాయిలో పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ కాంగ్రెస్ అసమ్మతి నాయకులు టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కప్పర భానుప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు కలిసిన సందర్భంగా ఆయన వారితో మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై ఆరా తీసి త్వరలోనే అధిష్టానానికి నివేదిక పంపిస్తామని, అందరినీ కలుపుకొనిపోయేలా చూస్తామన్నారు. పార్టీ ఎవరికీ అన్యాయం చేయదని,కష్టపడిన వారికి నామినేటెడ్ పదవుల్లో తప్పకుండా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

**మంత్రులను కలిసిన అసమ్మతి నాయకులు**

గజ్వేల్‌కు చెందిన అసమ్మతి కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రు లు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కప్పర భానుప్రసాద్‌తో పాటు పలువురు కలిశారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డికి వ్యతిరేకంగా అసమ్మతితో మంత్రులను కలిసి గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ పాలకవర్గంపై చర్చించారు.ఇదే అసమ్మతి వర్గం నాయకులు సోమవారం మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గంపై చర్చించారు.



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన అసమ్మతి నాయకులు

## అధికారులు సూచించే మెళకువలు పాటించాలి

గజ్వేల్, జూన్ 25: వ్యవసాయాధికారులు సూచించే మెళకువలు పాటించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. మంగళవారం రైతు వేదికల ద్వారా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. గజ్వేల్ రైతు వేదికలో మంగళవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు రైతులు అంతగా ఆసక్తిని చూపించలేదు. కార్యక్రమంలో ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

**రైతు భరోసాపై అభిప్రాయాల సేకరణ**

మర్కూక్, జూన్ 25 : వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి 'రైతు భరోసా' విధివిధానాలు, అమలుపై రైతుల అభిప్రాయాలను అధికారులు సేకరించారు. మర్కూక్‌లోని రైతు వేదికలో 'రైతు నేస్తం'లో భాగంగా ఏడీఏ అనిల్ కుమార్, ఏవో నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ములుగు, మర్కూక్ మండలాల వ్యవసాయశాఖ అధికారులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పంటల సాగు విధానం, చీడపీడల నివారణ, తదితర అంశాలపై వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం రైతు భరోసా విధి విధానాలపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ప్రసంగం వింటున్న రైతులు

## నార్కోటిక్ డాగ్స్ ద్వారా తనిఖీలు

గజ్వేల్, జూన్ 25: నార్కోటిక్ డాగ్స్ ద్వారా గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలపై గజ్వేల్ పోలీసులు మంగళవారం మండలంలోని శ్రీగిరిపల్లి, కొల్గూర్, ప్రజ్ఞాపూర్, గజ్వేల్ పాండవుల చెరువు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ ముత్యంరాజు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని వివిధ ప్రాంతాల్లో మత్తు పదార్థాల బ్లాక్ స్పాట్స్ గుర్తించడం జరిగిందని, పోలీస్‌స్టేషన్ పరిధిలో మరికొన్ని బ్లాక్ స్పాట్లను త్వరలోనే తనిఖీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



కొల్గూర్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

## మృతుల కుటుంబానికి ఆర్థికసాయం

గజ్వేల్, జూన్ 25: మండలంలోని మక్తమసాన్‌పల్లి మధిర గ్రామంలో తండ్రీ కూతురు షేక్ సిరాజ్, రేష్మ వ్యవసాయబావిలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మంగళవారం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ రజితావెంకటేశ్, మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్,గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, మైనార్టీ మండల అధ్యక్షుడు మోహిన్, మజ్జు, మునీర్, యాదగిరి ఉన్నారు.

## బాలాజీ బారులో అగ్ని ప్రమాదం

సిద్దిపేట టౌన్,జూన్ 25 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సిద్దిపేట ముస్తాబాద్ రోడ్డులోని బాలాజీబారులో మంగళవారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు,బాధితుల వివరాల ప్రకారం..బారు లోపల నుంచి పొగ రావడం గమనించి నిర్వాహకులకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి ఇన్‌చార్జి అగ్నిమాపక శాఖ అధికారి నరేశ్ సిబ్బందితో కలిసి వచ్చారు.ఎగిసి పడుతున్న మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో విలువైన మద్యం,ఖరీదైన ఫర్నిచర్ కాలిపోయింది. భారీగా ఆస్తి నష్టం తప్పా ఎవరికీ ప్రాణనష్టం జరుగలేదు. ప్రమాద ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరుద్ర పురుగులు దర్శనం



మృగశిర కార్తె ముగిసి ఆరుద్ర కార్తెలో వర్షాలు పడుతుండటంతో ఆరుద్ర పురుగులు పొలాల్లో దర్శనమిస్తున్నాయి. ఇన్నాళ్లు వానలు ముఖం చాటేయడంతో కనిపించలేదు. ఇటీవల కురిసిన వర్షాలతో ఆరుద్రలు కనిపిస్తున్నాయి.

–హుస్నాబాద్‌టౌన్, జూన్ 25

## ఇసుక డంపుల వేలం

మిరుదొడ్డి, జూన్ 25 : వారం రోజుల క్రితం మిరుదొడ్డి మండల కేంద్రంలో సీజ్ చేసిన ఇసుక డంపులను మంగళవారం మిరుదొడ్డి తహసీల్దార్ గోవర్ధన్ వేలం వేశారు. వేలం పాటలో సంజీవరెడ్డి అనే రైతు పాల్గొని రూ.58 వేలకు ఇసుక డంపులను దక్కించుకున్నాడు. కార్యక్రమంలో రైతులు, రెవెన్యూ ఆర్ఐలు రాజకుమార్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

**అక్రమ ఇసుక డంపుల స్వాధీనం**

మద్దూరు(ధూళిమిట్ట) జూన్ 25 : ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి వాగు శివారులోని అక్రమంగా నిల్వచేసిన 12 ఇసుక డంపులను మంగళవారం చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు పోలీస్ సిబ్బంది, ధూళిమిట్ట రెవెన్యూ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. సుమారు 150 ట్రాక్టర్ల ఇసుకను ధూళిమిట్ట తహసీల్దార్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చేర్యాల సర్కిల్ పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినా, డంపు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అభివృద్ధిపై నేడు ఎమ్మెల్యే సమీక్ష

దుబ్బాక,జూన్ 25: దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజారోగ్యం, పారిశుధ్యం తదితర అంశాలపై బుధవారం కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మె ల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దుబ్బాక ఐవోసీ (సమీకృత) కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు వైద్యారోగ్య, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు హాజరవుతారని ఆయన తెలిపారు.

**వేతనాలు చెల్లించాలని వినతి**

జగదేవ్‌పూర్, జూన్25: గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న తమకు జీతాలు చెల్లించడం లేదని వెంటనే చెల్లించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు మంగళవారం ఎంపీడీవో యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నందబయిన ఎల్లయ్య, మండల పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్షుడు యాదగిరి మాట్లాడారు. చాలీచాలని జీతాలతో ఏండ్ల తరబడి గ్రామ పంచాయతీల్లో పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు నాగరాజు, కనకవ్వ కిష్టయ్య, మర్కూక్ నర్సింహులు, మనెమ్మ పాల్గొన్నారు.

**ఉపాధి హామీపై అవగాహన**

గజ్వేల్, జూన్ 25 : మండలంలోని అనంతరావుపల్లిలో మంగళవారం ఉపాధి హామీ పథకంపై కూలీలు అవగాహన ర్యాలీ తీశారు. సామాజిక తనిఖీలో భాగంగా గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలకు స్టేట్ రిసోర్స్ పర్సన్ జీవన్, బ్లాక్ రిసోర్స్ పర్సన్ సింహాద్రి, కరుణాకర్, పూజిత అవగాహన కల్పించిన అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధి పథకంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. కార్యదర్శి జ్యోతి, కూలీలు పాల్గొన్నారు.